హామీల అమలుకు సమరశీల పోరాటాలు నిర్వహిస్తాం

ఎదులాపురం, ఆగస్టు 4 : కాంగ్రెస్ పార్టీ కార్మికులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని, లేని పక్షంలో కార్మికులను ఐక్యం చేసి సమరశీల పోరాటాలు నిర్వహిస్తామని సీఐటీయూ ఆదిలాబాద్ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో ఏర్పాటు చేసిన సీఐటీయూ రాష్ట్ర కౌన్సిల్ సమావేశంలో జిల్లా ప్రతినిధిగా హాజరై మాట్లాడారు. కార్మికులందరికీ పీఎఫ్, ఈఎస్ఐ, పింఛన్, బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు బొజ్జ ఆశన్న, కోశాధికారి సునీత పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా జాగ్రత్త పడాలి

కుబీర్, ఆగస్టు 4 : సీజనల్‌గా చిన్న పిల్లల్లో వచ్చే వ్యాధులపై తల్లిదండ్రులు తగు జాగ్రత్తలు తీసుకోవాలని ఖైంసా ఏరియా దవాఖాన పిల్లల వైద్య నిపుణుడు నరేశ్ సూచించారు. మండలంలోని బ్రహ్మేశ్వర్ గిరిజన తండాలో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో ఆయన గిరిజనులకు 'చిన్న పిల్లల్లో వచ్చే వ్యాధులు–తీసుకోవాల్సిన జాగ్రత్తల' పై అవగాహన కల్పించారు. గ్రామాల నుంచి వచ్చిన చిన్నారులను పరీక్షించి మందులు అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ గుగ్లావత్ దత్తురాం, తెలంగాణ శంకర్, సిబ్బంది పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

ఎదులాపురం, ఆగస్టు 4 : ఆదిలాబాద్‌లోని టీఎన్జీవోస్‌లో తుడుందెబ్బ ఆధ్వర్యంలో ఈ నెల 9వ తేదీన నిర్వహించే ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకల్లో ఆదివాసులు పెద్ద సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆదివాసీ కాంగ్రెస్ జిల్లా చైర్మన్ సెడ్మాకి ఆనంద్‌రావ్ పిలుపునిచ్చారు. ఆదివారం ఆదిలాబాద్ రూరల్ మండలం మలేబోరిగాం గ్రామ పంచాయతీ పరిధిలోని కేబీ కాలనీలో తుడుందెబ్బ నాయకులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. కార్యక్రమంలో తుడుందెబ్బ రాష్ట్ర నిర్వహణాధ్యక్షుడు గణేశ్, మండలాధ్యక్షుడు మెస్రం కేశవ్‌రావ్, ఉపాధ్యక్షులు రాము, తులసీరాం పటేల్, భూమన్న, దేవరావ్, దినేశ్, కోట్నాక్ జైతు పాల్గొన్నారు.

బోథ్, ఆగస్టు 4 : ఈ నెల 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని విజయవంతం చేయాలని తుడుందెబ్బ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కొడప నగేశ్ పిలుపునిచ్చారు. ఆదివారం బోథ్‌లోని కుమ్రం భీం చౌక్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో బోథ్ డివిజన్ అధ్యక్షుడు దుర్వ విశ్వేశ్వర్‌రావ్, బోథ్ మండల కమిటీ అధ్యక్షుడు కనక అమృత్‌రావ్, సొనాల కమిటీ అధ్యక్షుడు మారుతి, రాయిసెంటర్ సార్‌మేడిలు ఆడెం భీంరావ్, మడావి గంగారాం, రాయి సెంటర్ సలహాదారులు మడావి లాలురాం, తొడసం గోపాల్, పంద్రం సోనేరావ్, ఆడెం పొల్లన్న, సంగెపు శంకర్ పాల్గొన్నారు.

భీంపూర్, ఆగస్టు 4: ఈ నెల 9 న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా ఆదిలాబాద్‌లోని టీఎన్జీవోస్ భవనంలో సభ నిర్వహించనున్నట్లు తుడుందెబ్బ ప్రచార కార్యదర్శి మడావి నాగోరావ్ తెలిపారు. భీంపూర్‌లో పోస్టర్ విడుదల చేశారు. ఆదివాసీలు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో తుడుం దెబ్బ నాయకులు సిడాం ప్రభు , కుడిమెత సోనేరావ్ పాల్గొన్నారు.

• చిత్తడిగా అడెల్లి రోడ్డు

బురదమయంగా అడెల్లి రోడ్డు

బోథ్–నిర్మల్ ప్రాంతాలకు దూర భారం తగ్గించేందుకు నిర్మించిన అడెల్లి రోడ్డు చిత్తడిగా మారింది. రఘునాథ్‌పూర్ అటవీ ప్రాంతంలో బీటీ రోడ్డు నుంచి ఘాట్ రోడ్డు వరకు పూర్తిగా బురదమయంగా మారింది. ద్విచక్రవాహనాలు, ఆటోలు, కారులు బురదలో కూరుకపోతున్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి గుంతలలో మొరం వేసి, మరమ్మతులు చేయించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. – బోథ్, ఆగస్టు 4

• వాగుదాటితేనే వ్యవసాయ పనులు

తాంసి మండలం గోట్కూరి గ్రామ శివారులో వాగు దాటితేనే వ్యవసాయ పనులు కొనసాగుతాయని రైతులు వాపోతున్నారు. పొలం పనులు చేసుకోవడానికి నిత్యం అష్టకష్టాలు పడుతున్నారు. రాకపోకల కష్టాలను పరిష్కరించేందుకు కల్వర్టు నిర్మించాలని గోట్కూరి రైతులు కోరుతున్నారు.

– తాంసి, ఆగస్టు 4

నిండుగా ప్రవహిస్తున్న వాగు

• ప్రమాదకరంగా ఫ్లెక్సీలు

ఆదిలాబాద్‌లోని ప్రధాన రోడ్డు మధ్య ఏర్పాటు చేసిన ఫ్లెక్సీలు ప్రమాదకరంగా మారాయి. ఆదివారం కురిసిన వర్షానికి ఫ్లెక్సీలు ఉడిపోయి కింద పడిపోయాయి. ఆ ఫ్లెక్సీలు గాలికి ఎగిరిపడి వాహనదారులపై, లారీ, బస్సు డ్రైవర్ల అద్దాలపై పడితే పెను ప్రమాదం సంభవించే అవకాశాలు ఉన్నాయి. వర్షానికి పెద్ద పెద్ద ఫ్లెక్సీ ఫ్రేమ్‌ల నుంచి ఉడిపోయి కింది వేలాడుతున్నాయి. దీంతో చిన్నగా వీచిన గాలికి కూడా ఫ్లెక్సీ ఎగిరి పడే అవకాశాలు ఉన్నాయి. ఇప్పటికైనా అధికారులు స్పందించి ఫ్లెక్సీలను తొలగించాలని వాహనదారులు కోరుతున్నారు.

- ఆదిలాబాద్ ఫొటోగ్రాఫర్, ఆగస్టు 4

ఆదిలాబాద్‌లోని కలెక్టర్ చౌరస్తాలో వర్షానికి చినిగిపోయిన ఫ్లెక్సీ

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

నిర్మల్‌అర్బన్: అధ్యాపకులతో ఎస్ఎస్ఆర్ కళాశాల పూర్వవిద్యార్థులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 4 : నిర్మల్‌లోని ఎస్ఎస్ఆర్ కళాశాలలో 1997–99 విద్యా సంవత్సరం విద్యార్థులు ఆదివారం మారుతి ఇన్‌లో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనాన్ని, రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఒక్క చోట చేరి చదువుకున్న రోజులను గుర్తు చేసుకున్నారు. చదువు చెప్పిన అధ్యాపకులను శాలువాలతో సన్మానించారు. ప్రిన్సిపాల్ సాయన్న, అధ్యాపకులు మారుతిరావు, వెంకట్, వినోద్, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

ఆర్టీసీ బస్సుకు తప్పిన ప్రమాదం

వెనుక టైరు బోల్టులు ఊడిన ఆర్టీసీ బస్సు

భీంపూర్, ఆగస్టు 4 : భీంపూర్ మండలం అర్లి గ్రామం మీదుగా వెళ్తున్న ఆర్టీసీ బస్సు ప్రమాదానికి గురికాగా పెను ప్రమాదం తప్పింది. ఆదివారం ఆదిలాబాద్ నుంచి కరంజి(టీ) గ్రామానికి వెళ్తున్న ఆర్టీసీ బస్సు అర్లి దగ్గర ఎల్లమ్మ ఆలయ సమీపంలో వెనుక టైర్లు ఊడిపోయేలా ఉండగా, గమనించిన డ్రైవర్ చాకచాక్యంగా వ్యవహరించి ప్రమాదం నుంచి తప్పించారు. కాగా బస్సులో ఉన్న ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. తర్వాత మోకానిక్‌లు వచ్చి టైరు బిగించారు. దీంతో రోడ్డుపై గంటపాటు వాహనాలు నిలిచిపోయాయి. ఈ ఘటనపై ఆర్టీసీ అధికారులు విచారణ చేపడుతున్నారు. ఇటీవల అర్లి వద్ద రోడ్డుపై బస్సు అదుపు తప్పి పశువుల కొట్టంలోకి దూసుకెళ్లింది. ప్రమాదాలకు ప్రధానకారణం గుంతల రోడ్డు అని డ్రైవర్లు చెబుతున్నారు. ఆర్టీసీ వారు కూడా ఈ అధ్వాన్న రోడ్డుకు తగ్గట్టే డొక్కు బస్సులు నడుపుతున్నారని పలు గ్రామాలు ప్రజలు ఆరోపిస్తున్నారు.

బౌద్ధ మహాసభ సర్వసభ్య సమావేశం

మాట్లాడుతున్న నాయకులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 4 : నిర్మల్‌లోని బుద్ధవిహార్‌లో గల భారతీయ బౌద్ధ మహా సభ జిల్లా సర్వసభ్య సమావేశం ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు క్రాంతికిరణ్ మాట్లాడుతూ గ్రామగ్రామాన బౌద్ధాన్ని తీసుకెళ్లాలని సూచించారు. కార్యక్రమంలో జిల్లా గౌరవ సలహాదారులు గంగాధర్, సిద్ధు, జిల్లా అధ్యక్షుడు మురళీధర్, ప్రధాన కార్యదర్శి భుజంగరావు, శాంతారాం, రామారావ్ పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం

నిర్మల్ అర్బన్, ఆగస్టు 4 : ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణకు సుప్రీం కోర్టు గ్రీన్ సిగ్నల్ ఇవ్వడాన్ని హర్షిస్తూ ఆదివారం నిర్మల్‌లో మోచి సంఘం ఆధ్వర్యంలో సంబురాలు చేసుకున్నారు. స్థానిక మినీ ట్యాంక్‌బండ్ వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో సంఘం సభ్యులు పాల్గొన్నారు.

తోటి ఉద్యోగుల ఉదారత్వం

ఆర్థిక సాయం అందజేస్తున్న ఆదర్శ పాఠశాల సిబ్బంది

కుంటాల, ఆగస్టు 4 : వానల్‌పాడ్ గ్రామానికి చెందిన ఆదర్శ పాఠశాల ఉపాధ్యాయుడు వట్టాలి నవీన్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బాధిత కుటుంబానికి కుంటాల ప్రభుత్వ ఆదర్శ పాఠశాల సిబ్బంది రూ.1,13,000ల ఆర్థిక సాయం ఫిక్స్‌డిపాజిట్ చేసి అందజేశారు. ఇక్కడ ప్రిన్సిపాల్ శ్రీనివాస్ ప్రసాద్, ఉపాధ్యాయుల బృందం ఉన్నారు.

బురద చిత్తడితో ఇబ్బందులు

బురదలో దిగబడిన ఆటోను నెట్టుతున్న రైతు

ఇంద్రవెల్లి, ఆగస్టు 4: మండలంలోని వడగాం, హీరాపూర్, మామిడిగూడ గ్రామాలకు చెందిన రైతులు ఆటో ద్వారా ఎరువులు తరలిస్తున్నారు. ఇంద్రవెల్లిలోని వగడాం, తెలంగాణ తల్లిచౌక్‌లో చిత్తడితో బురదమయంగా మారిన రోడ్డులో ఆటో దిగబడింది. ఆటో డ్రైవర్ ఎంత ప్రయత్నం చేసిన ఎరువులతో ఉన్న ఆటో ముందుకు వెళ్లలేదు. రైతు ఆటో దిగి ఆటోను నెట్టి ఇబ్బందులు తొలగించారు.

విద్యార్థులకు ఆధునిక విద్యను అందిస్తున్నాం

ఉట్నూర్, ఆగస్టు 4: ఐటీఐ కళాశాలలో చదువుకునే విద్యార్థులకు ఆధునిక యంత్రాలు, పరికరాలతో విద్యను అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తున్నదని ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ అన్నారు. ఆదివారం ఉట్నూర్‌లోని కేబీ కాంప్లెక్స్‌లో ఐటీఐ కళాశాలలో రూ.4.76 కోట్లతో చేపడుతున్న నూతన భవనాల నిర్మాణానికి భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐటీఐ కళాశాల విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు టాటా కంపెనీ సహకారంతో కార్యక్రమాన్ని చేపట్టామని తెలిపారు. కార్యక్రమంలో కళాశాల సిబ్బంది, పార్టీ నాయకులు పాల్గొన్నారు.



పనులు ప్రారంభిస్తున్న ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జుపటేల్

నివాళులర్పించిన ఎమ్మెల్యే

కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు షేక్ సలీం కరెంట్ షాక్‌తో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్ ఆదివారం ఉట్నూర్‌లోని మృతుని ఇంటికి వెళ్లి దగ్గరుండి భౌతిక కాయానికి పోస్ట్‌మార్టం నిమిత్తం ప్రభుత్వ దవాఖానకు తరలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ సలీం అకాల మరణం తీవ్ర దిగ్భ్రాంతికి గురి చేసిందన్నారు. ఆయన వెంట పలువురు నాయకులు ఉన్నారు.

ఎమ్మెల్యేకు సన్మానం

ఉట్నూర్‌లోని క్యాంపు కార్యాలయంలో ఆదివాసీ సంఘాల పెద్దలు ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్‌ను మర్యాదపూర్వకంగా కలిసి శాలువాతో సన్మానించారు. ఈ సందర్భంగా సార్‌మేడి మెస్రం దుర్గు మాట్లాడుతూ ఆదివాసీ, లంబాడా సమస్యను పరిష్కరించాలని కోరుతూ అసెంబ్లీలో ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సార్‌మేడీలు, పటేళ్లు, ఆదివాసీ నాయకులు పాల్గొన్నారు.

వైన్స్‌లో చోరీ

ఇచ్చోడ, ఆగస్టు 4 : ఇచ్చోడలోని రేణుకా వైన్స్‌లో శనివారం అర్ధరాత్రి చోరీ జరిగింది. ఎస్ఐ తెలిపిన వివరాల ప్రకారం..అర్ధరాత్రి రేణుకా వైన్స్ తాళాలు పగుల గొట్టి నలుగురు దుండగులు లోనికి ప్రవేశించారు. షాపులో రూ.30 వేల నగదుతో పాటు రూ.2 వేల విలువైన మద్యం ఎత్తుకెళ్లారు. వైన్స్ యజమాని ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

బ్యాటరీ దుకాణంలో చోరీ

నిర్మల్ అర్బన్, ఆగస్టు 4 : నిర్మల్ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో ఎంఏ అజాజ్ బ్యాటరీ చార్జింగ్ షాపులో ఆదివారం ఉదయం గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. రూ.50 వేల విలువ గల బ్యాటరీలు దుండగులు ఎత్తుకెళ్లినట్లు దుకాణ యజమాని తెలిపారు. పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

గంజాయి తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

వ్యక్తిని అదుపులోకి తీసుకున్న ఎస్ఐ సునీల్

ఇంద్రవెల్లి, ఆగస్టు 4: ఇంద్రవెల్లి మండలం ఈశ్వర్‌నగర్ గ్రామ సమీపంలోని నర్సాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద అక్రమంగా గంజాయి తరలిస్తున్న సాబ్లే బక్షన్‌సింగ్‌ను పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ సునీల్ వివరాల ప్రకారం..నార్నూర్ మండలం చోర్‌గాం గ్రామానికి చెందిన సాబ్లే బక్షన్‌సింగ్ అక్రమంగా ఐదు కిలోల గంజాయిని ఆదిలాబాద్‌కు తరలిస్తున్నట్లు ముందస్తుగా అందిన సమాచారం మేరకు నర్సాపూర్ ఎక్స్‌రోడ్డు వద్ద పట్టుకున్నారు. అతడిని అదుపులోకి తీసుకొని గంజాయి స్వాధీనం చేసుకొని కేసు నమోదు చేసి జైలుకు రిమాండ్ చేశామని తెలిపారు. పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ఆవుకు అంత్యక్రియలు

ఇంద్రవెల్లి, ఆగస్టు 4: ఇంద్రవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలో శనివారం రాత్రి కురిసిన వర్షంతో ఆవు మృతి చెందింది. ఆదివారం ఈ విషయాన్ని తెలుసుకున్న మాజీ సర్పంచ్ కోరెంగా సుంకట్‌రావ్, సిబ్బంది నారాయణ సంఘటన స్థలానికి వెళ్లి మృతి చెందిన ఆవు కాళ్లకు తాడు కట్టి కొద్ది దూరం వరకు లాక్కెళ్లి జేసీబీతో గోతిని తవ్వించి అందులో ఆవుకు అంత్యక్రియలు చేశారు.

ఉచిత వైద్య శిబిరం

ఇంద్రవెల్లి, ఆగస్టు 4 : ఏమాయికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని ప్రభుత్వ పాఠశాలలో మాజీ సర్పంచ్ జాదవ్ లఖన్‌సింగ్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఆదిలాబాద్‌లోని శ్రీకృష్ణ క్రిటికల్ కేర్ దవాఖానకు చెందిన వైద్యులు క్రాంతికుమార్, దుర్వ గణేశ్, కావ్య, రాహూల్‌తో పాటు సిబ్బంది రోగులకు వైద్య పరీక్షలు చేశారు. వ్యాధులతో బాధపడుతున్న వారికి వివిధ రకాల మందులు అందజేశారు. కార్యక్రమంలో గ్రామస్తులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణపై హర్షం

ఎదులాపురం : పాలాభిషేకం చేస్తున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

ఎదులాపురం, ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణపై సుప్రీం కోర్టు తీర్పు దేశ ప్రజలకు న్యాయ వ్యవస్థపై మరింత నమ్మకాన్ని పెంచిందని, ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు అరెల్లి మల్లేశ్ అన్నారు. ఆదివారం జిల్లా కేంద్రంలోని బాబు జగ్జీవన్ రాం విగ్రహం ఎదుట కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహించారు. మందకృష్ణ మాదిగ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. తక్షణమే రాష్ట్ర ప్రభుత్వం వర్గీకరణను అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకులు ఇండ్ల ఎల్లన్న, వినయ్ సాగర్, టౌన్ నాయకులు మోడిపల్లి మనోజ్, ఆరెపల్లి గణేశ్, పసుల వేణు, రాములు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి మానాల శేఖర్, ప్రమోద్, శివకుమార్, మహేందర్ పాల్గొన్నారు.

ఇచ్చోడ, ఆగస్టు 4 : మండల కేంద్రంలో బుడగ జంగం ఆధ్వర్యంలో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో బుడగ జంగం సంఘం మండలాధ్యక్షుడు ఇర్నాల పెంటన్న, జిల్లా ప్రధాన కార్యదర్శి గంగయ్య, మండల సంఘం ఉపాధ్యక్షుడు రవి, నాయకులు రాములు, హనుమంతు, భీమన్న పాల్గొన్నారు.

బోథ్, ఆగస్టు 4 : ఎస్సీ వర్గీకరణకు అనుకూలంగా కోర్టు తీర్పునివ్వడం హర్షణీయమని కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ ఇన్‌చార్జి ఆడె గజేందర్ అన్నారు. ఆదివారం కౌఠ(బీ) గ్రామంలో మందకృష్ణ మాదిగ, సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు ఇట్టెడి నాగభూషణం రెడ్డి, యాల్ల బుచ్చ రెడ్డి, ఇట్టెడి రాజు రెడ్డి, శ్రీనివాస్, సురేందర్, గంగాధర్, గణేశ్, రవీందర్ రెడ్డి, సాయికృష్ణారెడ్డి, పోతారెడ్డి పాల్గొన్నారు.

తరలిరండి

నిర్మల్ అర్బన్, ఆగస్టు 4: ఎస్సీ వర్గీకరణలో మాలలు వారి ఉపకులాలకు అన్యాయం జరుగుతుందని, జనాభా గణన జరుగకుండానే ఎస్సీ వర్గీకరణకు ముఖ్యమంత్రి ఆర్డినెన్స్ తీసుకువస్తాననడం ఒక వర్గం మెప్పుపొందడానికేనని జేఏసీ నేతలు అన్నారు. దీనిని వ్యతిరేకిస్తూ సోమవారం ఉదయం 10 గంటలకు కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం ఇస్తామని జిల్లాలోని మాలలు, వారి ఉపకులాలు తప్పకుండా హాజరుకావాలని కోరారు.

అడెల్లి ఆలయంలో సీఐ పూజలు

సారంగాపూర్, ఆగస్టు 4: మండలంలోని శ్రీ మహా అడెల్లి పోచమ్మ ఆలయంలో ఆదివారం నిర్మల్ రూరల్ సీఐ రామకృష్ణ పూజలు చేశారు. ఎస్ఐ శ్రీకాంత్, సీనియర్ అసిస్టెంట్ సముద్రాల రమణారావు పాల్గొన్నారు.

ప్రైవేట్ ఉపాధ్యాయులకు సీఎం క్షమాపణ చెప్పాలి

మాట్లాడుతున్న ప్రైవేట్ ఉపాధ్యాయులు

నిర్మల్ అర్బన్, ఆగస్టు 4 : ప్రైవేట్ ఉపాధ్యాయుల మనోభావాలను కించపర్చే విధంగా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి వారికి క్షమాపణ చెప్పాలని ప్రైవేట్ టీచర్స్ అసోసియేషన్ జిల్లా సభ్యులు డిమాండ్ చేశారు. ఆదివారం నిర్మల్‌లో నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. ఇంటర్, డిగ్రీ తప్పిన వారు ప్రైవేట్ ఉపాధ్యాయులు అని సీఎం మాట్లాడడం చాలా బాధకరమని అన్నారు. నోటిఫికేషన్లు లేక ఉపాధ్యాయ వృత్తిపై మక్కువతో చాలీచాలని వేతనాలు ఉన్నా జ్ఞానం ఎక్కువేనని మర్చిపోవద్దని అన్నారు. ప్రస్తుతం ప్రభుత్వ పాఠశాల ఉపాధ్యాయుల పిల్లలు సైతం ప్రైవేట్‌లో చదువుతున్నారని గుర్తు చేశారు. తన మాటలను వెంటనే వెనక్కి తీసుకొని క్షమాపణ చెప్పాలన్నారు. కార్యక్రమంలో ప్రైవేట్ ఉపాధ్యాయ కమిటీ సభ్యులు హరీశ్, రాంప్రసాద్, పండరినాథ్, శ్రీనివాస్, విజయ్, శివ పాల్గొన్నారు.

సీఐని కలిసిన ట్రస్మా సంఘం నేతలు

సీఐని సన్మానిస్తున్న ట్రస్మా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్

నిర్మల్ అర్బన్, ఆగస్టు 4: నిర్మల్ రూరల్ సీఐగా ఇటీవల బాధ్యతలు స్వీకరించిన రామకృష్ణను ఆదివారం ట్రస్మా ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ గౌడ్ మర్యాదపూర్వకంగా కలిసి పూల మొక్కను అందజేసి శాలువాతో సన్మానించారు. సీఐని కలిసిన వారిలో అజర్, ప్రముఖ వ్యాపార వేత్త కిషన్ ఉన్నారు.

కార్యదర్శికి సన్మానం

బోథ్, ఆగస్టు 4 : సొనాల గ్రామ పంచాయతీలో కార్యదర్శిగా పదేళ్లుగా పని చేసి బదిలీపై వెళ్తున్న ఎస్ స్వామిని ఆదివారం సన్మానించారు. గ్రామ పంచాయతీ కార్యాలయంలో పీఆర్టీయూ నాయకులు శాలువాతో సత్కరించారు. కార్యక్రమంలో పీఆర్టీయూ బజార్‌హత్నూర్ మండలాధ్యక్షుడు కటకం చంద్రకాంత్, ఎస్ఏ తెలుగు ఉపాధ్యాయుడు రామగిరి దామోదర్, గౌరి శ్రీధర్, చిలువేరి నాగభూషణ్, కొండ రమేశ్, రామగిరి శ్రీనివాస్, పెరక మహేందర్ పాల్గొన్నారు.

కార్యదర్శిని సన్మానిస్తున్న పీఆర్టీయూ నాయకులు

పూలాజీబాబా జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలి

మాట్లాడుతున్న ఆంధ్ ఆదివాసీ సమాజ్ జిల్లా అధ్యక్షుడు ముకాడే విష్ణు

ఇంద్రవెల్లి, ఆగస్టు 4: పూలాజీబాబా జయంత్యుత్సవాలను విజయవంతం చేయాలని ఆంధ్ ఆదివాసీ సమాజ్ జిల్లా అధ్యక్షుడు ముకాడే విష్ణు పిలుపునిచ్చారు. ఆదివారం అంజి గ్రామ పంచాయతీ పరిధిలోని మామిడిగూడలోని పూలాజీబాబా ధ్యానకేంద్రంలో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో పలు అంశాలతో పాటు ఈ నెల 30వ తేదీన నిర్వహించే పూలాజీబాబా జయంతి వేడుకలతో పాటు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహణపై చర్చించారు. కార్యక్రమంలో గ్రామస్తులు ఇంగ్లే కేశవ్, కైలాస్, రాందాస్, పాండురంగ్, మారుతి, భగవాన్, శ్యామ్‌రావ్ పాల్గొన్నారు.

ఆర్థిక సాయం

ఆర్థిక సాయం అందిస్తున్న 2001–02కు చెందిన పూర్వ విద్యార్థులు

ఇంద్రవెల్లి, ఆగస్టు 4 : ఏమాయికుంట గ్రామ పంచాయతీ పరిధిలోని గలియబాయితండాకు చెందిన మొంగర్ ధరం సింగ్ అనారోగ్యంతో బాధపడుతున్నాడు. ఈ విషయాన్ని తెలుసుకున్న మండలంలోని జిల్లా పరిషత్ పాఠశాలలో 2001–02కు చెందిన పదో తరగతి పూర్వ విద్యార్థులు మొంగర్ ధరంసింగ్‌ను పరామర్శించారు. అనంతరం ఆయన కుటుంబ సభ్యులకు రూ.10వేలతో నిత్యావసర సరుకులు కొనుగోలు చేసి, 40వేల నగదు అందజేశారు. ఇక్కడ దేవీదాస్, జనార్దన్, బాలాజీ, సుభాష్ ఉన్నారు.

నేడు మండలానికి ఎమ్మెల్యే రాక

తలమడుగు, ఆగస్టు 4 : మండలంలోని అర్లి గ్రామంలో సోమవారం నిర్వహించే అఖండ జ్యోతి పూజ కార్యక్రమానికి బోథ్ ఎమ్మెల్యే జాదవ్ అనిల్ హాజరవుతున్నట్లు బీఆర్ఎస్ మండల కన్వీనర్ తోట వెంకటేశ్ తెలిపారు. ఈ కార్యక్రమానికి మండల నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో హాజరుకావాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

PUBLIC HEALTH CHEMICALS
టెమీ ఫాస్ 50% EC, మలాతియన్ 50% EC, పైరిత్రమ్ 2% EC, డెల్టామెత్రిన్ 1.25% ULV, MLO ఆయిల్, పైరోసిన్ ఆయిల్ etc.
మునిసిల్ కార్పొరేషన్స్‌కి, గ్రామ పంచాయతీలకి మరియు నగర పంచాయతీలకి సప్లై చేయబడును.
డీలర్స్ మరియు మునిసిపల్ కాంట్రాక్టర్స్ సంప్రదించవలసిన నంబర్లు
9346771599, 8790185234, 9701298656

WANTED
jobs Apply Now!
★హరేకృష్ణ హోంకేర్ హైదరాబాద్ నందు వృద్ధులను, పేషెంట్స్‌ను చూసుకొనుటకు వర్కర్స్, నర్సులు కావలెను. ఉచిత వసతి, భోజనం. జీతం: 16K to 18K, ఏజెంట్ కమీషన్ 6K. Ph: 9640258899 / 9640468899.
NT-325783-All

గమనిక
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads
మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం
4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే
ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే
3+1 స్కీం కలదు
ప్రకటనల విభాగం...
GST 5% వర్తించును
మంచిర్యాల: 91827 77676, ఆసిఫాబాద్: 91827 77679
నిర్మల్: 91827 77671, 91827 77677